

కొత్తపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రచారం పేర.. పంచుకున్నారు



కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు(ఫైల్)

- కంటి వెలుగు కార్యక్రమం నిధులు స్వాహా చేసిన అధికారులు
- కాంటిన్‌జెన్సీ కింద ఒక్కో జిల్లాకు రూ.5 లక్షల బడ్జెట్ విడుదల
- టీలు, కాఫీలు, డ్రైఫ్రూట్స్ ఇవ్వకుండానే ఇచ్చినట్లు బిల్లులు
- రూ.2 లక్షలు ఖర్చు చేసి, రూ.3 లక్షలు స్వాహా
- మహబూబ్‌నగర్‌లో వివరాలు ఇచ్చేందుకు నిరాకరణ
- సెక్షన్ అధికారి చార్జ్ ఇవ్వలేదంటూ సాకులు
- గత ప్రభుత్వంలో వెలుగు చూసిన అవినీతి

మహబూబ్‌నగర్(వైద్య విభాగం) జూన్ 26: రాజుల సొమ్ము రాళ్లపాలు అనేది ఒకప్పటి సామెత. ప్రభుత్వ సొమ్ము అధికారుల పాలు అనేది నేటి మాట. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కంటి వెలుగు కార్యక్రమం అందుకు అద్దం పడుతోంది. ఏకంగా రూ.ఐదు లక్షలు ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఖర్చు చేశారు. అవి ఎందుకోసం వెచ్చించారో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. బ్యానర్లు, ప్రచార సామగ్రి, సమావేశాలు, టీ, కాఫీ, డ్రై ఫ్రూట్స్ కోసం వినియోగించినట్లు బిల్లులు చేసి, డబ్బులు డ్రా చేసుకున్నారు. మిగిలిన డబ్బులు అందరూ తలా కొంత పంచుకున్నారు. ఈ అవినీతి ఉమ్మడి ఐదు జిల్లాల్లో చోటుచేసుకుంది.

ఒక్కో జిల్లాకు రూ. 5 లక్షలు..

2019 ఏప్రిల్‌లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఆ తర్వాత రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 2023 జనవరి 18 నుంచి ప్రారంభించింది. జనవరి నుంచి జూలై వరకు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రారంభించారు. మొదటి రోజు అప్పటి సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాలో జనవరి 18న ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 19 నుంచి ప్రారంభించాలని, ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల్లోని మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి ఒక్కో జిల్లాకు రూ.ఐదు లక్షల చొప్పున రూ.25 లక్షలు బడ్జెట్ కూడా విడుదల చేసింది.

రూ.మూడు లక్షల్లో అవినీతి..

ఒక్కో జిల్లాకు ప్రచారం కోసం విడుదల చేసిన రూ.ఐదు లక్షల్లో ఖర్చు చేసింది కొంతే అయినా.. బిల్లులు మాత్రం మొత్తం రూ.ఐదు లక్షలు తీసుకున్నారు. అందులో మొదటి రోజు కార్యక్రమం ప్రారంభోత్సవానికి అయిన ఖర్చు రూ.2.5 లక్షలు. స్టేజ్ డెకరేషన్, ముఖ్య అతిథులకు టీ, కాఫీలు, డ్రై ఫ్రూట్స్, సభలు, సమావేశాల కోసం వాటిని ఖర్చు చేసినట్లు బిల్లులు చేశారు. అదేవిధంగా ప్రతీ జిల్లాలో డెమో విభాగానికి మరో రూ. 2.5 లక్షలు అప్పంచారు. అందులో బ్యానర్లు, ప్రచార సామగ్రి, కంటి వెలుగు కార్యక్రమం స్టిక్కర్లు, శిబిరాలలో సూచిక బోర్డులకు ఖర్చు చేసినట్లు చూపించారు. కానీ వాస్తవ పరిస్థితులు చూస్తే మాత్రం విస్తుపోవాల్సిందే. కార్యక్రమం ప్రారంభోత్సవం రోజున కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు, మరికొన్ని జిల్లాల్లో ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అయితే ఖర్చులు చూపించినంత స్థాయిలో స్టేజీలు వేయలేదు. బ్యానర్లు మాత్రం పెట్టి, బెలూన్లు కట్టారు. కొన్ని మాడల్ శిబిరాలలో మాత్రమే గోడలకు స్టిక్కర్లు వేయించారు. ప్రచార సామగ్రి కూడా ముద్రించకుండానే బిల్లులు చేసినట్లు సమాచారం. ఏ సమావేశంలోనూ డ్రైఫ్రూట్స్ పెట్టలేదు. కనీసం సిబ్బందికి కూడా టీ, కాఫీలు తెప్పించలేదు. ఆయా గ్రామాల్లో ఉండే ప్రజాప్రతినిధులే వారికి అన్నీ సమకూర్చారు. కానీ అధికారులు మాత్రం బిల్లులు పెట్టి, డబ్బులు డ్రా చేశారు. మొత్తంగా వీటన్నింటికి రూ.రెండు లక్షల లోపే ఖర్చు కాగా, మిగతా రూ.మూడు లక్షలు పంచుకున్నట్లు తెలుస్తోంది.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం: జిల్లా వైద్యాధికారి

మహబూబ్‌నగర్ జిల్లాలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఈ నిధులకు సంబంధించి సమాచారం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఆ సెక్షన్ చూసే అధికారి ఆరు నెలల క్రితం పదోన్నతిపై మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి వెళ్లారు. అప్పటి నుంచి ఆ సెక్షన్ తమకు అప్పగించలేదని, తమ వద్ద వివరాలు లేవని ప్రస్తుతం ఉన్నవారు చెప్పడం గమనార్హం. ఇదే విషయంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణను వివరణ కోరగా ఈ కాంటిజెన్సీ బడ్జెట్‌లో అవినీతి జరిగినట్లు తన దృష్టికి రాలేదన్నారు. సెక్షన్ చూసిన అధికారిని పిలిపించి రికార్డులు, బిల్లులు పరిశీలిస్తానని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం ఇలాకాపై.. ప్రత్యేక నజర్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్(ఫైల్)

- కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై గురి
- అధికారులతో నారాయణపేట, వికారాబాద్ జిల్లాల కలెక్టర్ల సమీక్ష
- కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో పేట కలెక్టర్ పర్యటన

నారాయణపేట, జూన్ 26: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వికారాబాద్, నారాయణపేట రెండు జిల్లాల పరిధిలో ఈ నియోజకవర్గం ఉండటంతో ఆయా మండలాల అభివృద్ధిపై ఇరు జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్ తాజాగా అధికారులతో వికారాబాద్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను శాఖల వారీగా, ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని చెప్పారు. మంజూరైన పనులకు టెండర్లు నిర్వహించి ప్రారంభించాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన కాడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)కి ప్రత్యేక అధికారిగా వెంకటరెడ్డిని నియమించింది. ఆయన అధికారులను సమన్వయం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించారు. నారాయణపేట జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా పరిధిలోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గంలోని మండలాలు కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లిలలో అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు చర్యలు చేపట్టారు. కోస్గిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం కోసం సర్వే నంబర్ 1665లో నాలుగు ఎకరాలను, అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కూడా మంజూరు కాగా, స్థానిక శివాజీ చౌరస్తాలో ఐదు ఎకరాలను గుర్తించారు. ఆ భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపనలు కూడా చేశారు. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా నిలపాలని..

కలెక్టర్ సిక్తా పట్నాయక్ మండలాల్లో అభివృద్ధి పనులను నిత్యం పరిశీలిస్తున్నారు. మద్దూర్ జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించి స్కూల్‌లో 800 మంది విద్యార్థులు ఉండటం గొప్ప విషయమని అన్నారు. పాఠశాలల్లో అవసరమైన అన్ని వసతులు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు రాష్ట్రంలోనే ఆదర్శం కావాలని చెప్పారు. మద్దూర్ పీహెచ్‌సీ, సీహెచ్‌లను తనిఖీ చేసి, వైద్య సేవలపై ఆరా తీశారు. కలెక్టర్ విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి పనులను వేగిరం చేసేలా చర్యలు చేపడుతుండటంతో అధికారుల్లో హడావుడి మొదలైంది. సీఎం సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా నిలపాలని అధికార యంత్రాంగం పని చేస్తోంది.



కొడంగల్ నియోజకవర్గ అధికారులతో వికారాబాద్ కలెక్టరేట్‌లో సమావేశమైన వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు ప్రతీక్ జైన్,సిక్తా పట్నాయక్(ఫైల్)

రహదారులకు మహర్దశ

మరోవైపు రహదారుల రూపురేఖలు మారనున్నాయి. మద్దూర్, కోస్గి మండలాల పరిధిలో మద్దూర్ నుంచి లింగాల్‌చేడ్ వరకు డబుల్ రోడ్డు వేయనున్నారు. మద్దూర్ నుంచి నారాయణపేట వరకు రోడ్డును విస్తరించనున్నారు. కోటకొండ నుంచి మద్దూర్ వరకు, రావల్‌పల్లి నుంచి మద్దూర్ వరకు రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఆయా రోడ్ల పనులకు టెండర్లు పూర్తవడంతో పనులు మొదలు కానున్నాయి.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ఈ నెల 25న కోస్గిలో రూ.30 లక్షల వ్యయంతో విద్యుత్ కార్యాలయ నూతన భవనానికి భూమి పూజ చేశారు. ముశ్రీఫా గ్రామంలో వాగుపై రూ.ఐదు కోట్లతో నిర్మించే బ్రిడ్జి, మద్దూర్ నుంచి వత్తుగుండ్ల మీదుగా నారాయణపేటకు రూ.46 కోట్లతో చేపట్టే రోడ్డు, మద్దూర్-రావులపల్లి మార్గంలో క్యాచ్ వార్ వాగుపై రూ.4.5 కోట్లతో నిర్మించే హై లెవల్ బ్రిడ్జి, కొత్తపల్లి-గుండుమాల్ మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి కాడా అధికారి వెంకట్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భూమి పూజ చేసి, ప్రారంభించారు.





జియోడోరమ్ లాక్సీఫ్లోరమ్ పుష్పం

జియోడోరమ్ డెన్సీఫ్లోరమ్ పుష్పం

అరుదైన ఆర్కిడ్ పుష్పాలు

- జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో పూసిన పూలు

జడ్చర్ల, జూన్ 26: జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో అరుదైన ఆర్కిడ్ పుష్పాలు పూసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య బుధవారం తెలిపారు. ఆర్కిడ్ జాతుల పుష్పాలు దట్టమైన అడవులలో, తేమ ఎక్కువగల ప్రదేశాలలో, నీడలో పెరుగుతాయని వారు తెలిపారు. ఇలాంటి పుష్పాలు తెలంగాణలో కేవలం 31 జాతులు మాత్రమే ఉన్నాయన్నారు. నల్లమల అడవి నుంచి రెండు సంవత్సరాల క్రితం తెచ్చిన జియోడోరమ్ లాక్సీఫ్లోరమ్, జియోడోరమ్ డెన్సీఫ్లోరమ్ అనే మొక్కలు పూలు పూశాయన్నారు. జియోడోరమ్ లాక్సీఫ్లోరమ్ మొక్క ముదురు బంగారు వర్ణంలో, లేత పసుపు రంగులో 30 సెంటీ మీటర్లు పెరుగుతుందన్నారు. ఈ మొక్కకు కేవలం నాలుగు నుంచి ఎనిమిది పుష్పాలు మాత్రమే పూస్తాయన్నారు. జియోడోరమ్ డెన్సీఫ్లోరమ్ మొక్క లేత తెలుపు, ఊదా రంగులో ఉండి.. లోపల పసుపు రంగు మచ్చలను కలిగి ఉంటుందన్నారు. ఈ మొక్కకు 20 వరకు పుష్పాలు పూస్తాయన్నారు. ఈ ఆర్కిడ్ జాతుల పుష్పాలు జడ్చర్ల బొటానికల్ గార్డెన్‌లో పూయడం సంతోషంగా ఉందని వారు అన్నారు.

పాత ఇనుప సామాను దుకాణానికి పాఠ్యపుస్తకాలు

- గమనించిన స్థానికులు పోలీసులకు అప్పగింత



పాత సామాను దుకాణంలో ఉన్న పాఠ్యపుస్తకాలు

అచ్చంపేటటౌన్, జూన్ 26: విద్యార్థులకు చేరాల్సిన పాఠ్యపుస్తకాలను పాతసామాను దుకాణానికి విక్రయించిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను పాత సామాను కొనుకునే వ్యక్తికి రూ 6900లకు పట్టణంలోని స్టేడియం వెనకాలకు తీసుకువచ్చి విక్రయించినట్లు తెలిపారు.

పాఠ్యపుస్తకాలు పాత సామాను దుకాణంలో బుధవారం సాయంత్రం కనిపించడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పాత సామాను దుకాణ యజమాని మార్కండేయను, ఆటోను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాఠ్యపుస్తకాలు విక్రయించిన శంకర్ అనే వ్యక్తి గతంలో అచ్చంపేట గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్‌గా విధులు నిర్వహించేవాడు. ప్రస్తుతం అతను పదవీ విరమణ పొంది ఇంటి దగ్గరే ఉన్నాడు. ఉన్నతాధికారుల సూచన మేరకు కేసు విచారణ చేస్తామని ఎస్సై రాము తెలిపారు.

చెంచు నాగన్న శవానికి పోస్టుమార్టం



పోస్టుమార్టం జరుగుతున్న స్థలంలో ఆర్డీవో, సీఐ

కొల్లాపూర్, జూన్ 26: రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి బ్రమరాంబ చెంచుగూడెం నాగన్న(48) అనుమానాస్పద మృతి మిస్టరీని ఛేదించేందుకు బుధవారం ఆయన శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పోస్టుమార్టం చేయించారు. నాగన్నను 23 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన కొందరు కొట్టి చంపి, పూడ్చి పెట్టారని అతని కుమారుడు కాట్రాజు సలేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, సీఐ మహేష్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ హృషికేష్ సమక్షంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ వైద్యులు దశరథం, హనుమంతు.. నాగన్న శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యులు సేకరించిన ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. నెలరోజుల్లో నివేదిక వస్తుందని, నివేదిక ద్వారా కేసు పురోగతి దర్యాప్తు కొనసాగుతుందని సీఐ మహేష్ తెలిపారు.

రెండోసారి షోకాజ్ నోటీసులు



ఉపాధ్యాయ బదిలీలపై డీఈవోతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి(ఫైల్)

- స్పౌజ్ పాయింట్ల వినియోగంలో జీహెచ్‌ఎంల తప్పుడు సమాచారం
- గతంలోనే వారికి నోటీసులు
- వివరణ ఇవ్వకపోవడంతో తాజాగా మరోసారి అందజేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 26: గత సంవత్సరం సెప్టెంబరులో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 15 మంది గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు తాజాగా రెండోసారి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వారు తప్పుడు సమాచారం ఇచ్చి, తమకు అనుకూలమైన పాఠశాలలను ఎంచుకున్న వైనంపై అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. దీనిపై ఆర్‌జేడీ విచారణ చేపట్టి, కొందరికి షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ, ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో వారిపై చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల కోసం ఉపాధ్యాయులు తప్పుడు సమాచారం ఇచ్చారని తాజాగా 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం వచ్చింది. స్పందించిన ఆర్‌జేడీ విజయలక్ష్మి సదరు ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలకు వెళ్లి బదిలీల గురించి తెలుసుకున్నారు. కేంద్రానికి ఉదయం 11 గంటలకు వచ్చిన ఆమె సాయంత్రం మూడు గంటల వరకు అక్కడే ఉండి పరిస్థితిని చక్కదిద్దారు. అదే సమయంలో గత సెప్టెంబరులో జరిగిన జీహెచ్‌ఎంల బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల కోసం తప్పుడు సమాచారం జీహెచ్‌ఎంలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని డీఈవో రవీందర్‌ను ప్రశ్నించారు. తప్పుడు సమాచారం ఇచ్చిన 15 మంది జీహెచ్‌ఎంలకు వెంటనే షోకాజ్ నోటీసులు ఇచ్చి, మూడు రోజుల్లో వివరణ తీసుకోవాలని డీఈవోను ఆదేశించింది. ఆ మేరకు డీఈవో ఎ.రవీందర్ 15 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని చెప్పామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లోనూ కొందరు తప్పుడు సమాచారం ఇచ్చారని తమ దృష్టికి వచ్చిందన్నారు. హెచ్చరించి ఆ సమాచారాన్ని తొలగించామని చెప్పారు. ఇకముందు ఇలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యాతూర్-2 ఎత్తిపోతలకు రూ.1.91 కోట్లు

- చెల్లింపులకు పరిపాలన అనుమతి

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ మండలంలో శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్‌పై చేపట్టిన క్యాతూర్-2 ఎత్తిపోతల పథకానికి రూ.1.91 కోట్లను విడుదల చేయడానికి ప్రభుత్వం పరిపాలన అనుమతిని ఇచ్చింది. 2013లో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి(ఆర్ఐడీఎఫ్) కింద 15 ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం పరిపాలన పరమైన అనుమతినిచ్చిన విషయం విదితమే. 3,460 ఎకరాలు సాగు నీరు అందించడానికి వీలుగా క్యాతూర్-2 ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. దీనికి చెల్లింపులు చేయాల్సి ఉంది. దాంతో రూ.1.91 కోట్ల నిధులను విడుదల చేయడానికి పరిపాలన అనుమతి ఇవ్వాలని మూడేళ్ల కిందట ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. తాజాగా ఈ పథకానికి నిధులు ఇవ్వాలని ఈఎన్‌సీ(జనరల్) కోరడంతో దీనికి ప్రభుత్వం స్పందించి, ఉత్తర్వులు జారీ చేసింది.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

నారాయణపేట/ధన్వాడ, జూన్ 26: పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు, రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయాధికారి ఎండీ రఫీ బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ధన్వాడకు చెందిన బాలికను శంషాబాద్‌లోని సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన డ్రైవర్ నర్సింహ ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమెను బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి 2023 సెప్టెంబరు 16న ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేయగా, సీఐ రాజేందర్ విచారణ చేపట్టాడు. నేరస్తుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించారు. అనంతరం సాక్షులను ప్రవేశపెట్టారు. వాదనలు విన్న న్యాయాధికారి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు.

మరో కేసులో మూడేళ్లు

గద్వాల క్రైం: బాలికపై అత్యాచారానికి యత్నించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా న్యాయాధికారి కె.కుష బుధవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2020 ఆగస్టు 12న మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కుటుంబ సభ్యులతో కలిసి పత్తి పొలంలో పనికి వెళ్లింది. సాయంత్రం బహిర్భూమి కోసం పక్క పొలంలోకి వెళ్లి వస్తుండగా, పక్క పొలానికి చెందిన తెలుగు జయరాం బలిక నోట్లో వస్త్రం కుక్కి, అత్యాచారం చేయబోయాడు. బాలిక తప్పించుకొని తల్లిదండ్రులకు తెలిపింది. నిందితుడిపై 2020 ఆగస్టు 13న మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు. న్యాయాధికారి కె.కుష బుధవారం ఇరువురి వాదనలు విన్నారు. నేరం రుజువు కావడంతో జయరాంకు మూడేళ్ల జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

అక్రమార్కులను హడలెత్తిస్తున్న ఏసీబీ

- లంచం డిమాండ్ చేస్తూ పట్టుబడ్డ ఎస్సై రవి
- గతంలో ఏసీబీకి చిక్కిన ఎస్సై, తహసీల్దార్
- తాజా సంఘటన మండలంలో మూడోది


ఏసీబీకి పట్టుబడిన ఎస్సై రవి, విక్రమ్ (ఫైల్)

వెల్దండ, జూన్ 26 : లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కి కటకటాల పాలైన వెల్దండ ఎస్సై రవి ఉదంతం మండలంలో సంచలనంగా మారింది. అక్రమ సంపాదనకు అలవాటుపడిన అధికారులకు ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులతో చుక్కలు చూపెడుతున్నారు. నెలవారీగా వచ్చే సంపాదన సరిపోని సదరు అధికారులు అడ్డదారులు తొక్కి లంచావతారాలుగా మారి అడ్డంగా బుక్కవుతూ తమ విలువైన ఉద్యోగ జీవితాల్లో మాయని మచ్చని మిగుల్చుకుంటూ కటకటాల పాలవుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ ఎస్సై, మరో తహసీల్దార్‌లు సైతం లంచాలు డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కారు. తాజాగా ఈ మధ్యకాలంలోనే వెల్దండ ఎస్సైగా ఉద్యోగంలో చేరిన ఎస్సై రవి ఏసీబీకి చిక్కారు. కల్వకుర్తికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి వద్ద డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ పట్టుబడ్డాయి. దీంతో అతన్ని స్టేషన్‌కు పిలిపించి కొట్టినట్లు సమాచారం. అంతేగాక రూ.50 వేలు లంచం ఇవ్వాలని లేకపోతే కేసు నమోదు చేస్తానని బెదిరించినట్లు తెలిసింది. దీంతో బాధితుడు లంచం ఇచ్చేందుకు అంగీకరించి ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో కల్వకుర్తిలో ఉన్న తనకు సంబంధించిన వ్యక్తి విక్రమ్‌కు రూ.50 వేలు ఇవ్వాలని ఎస్సై రవి బాధితుడు వెంకటేష్‌కు ఫోన్ ద్వారా సూచించాడు. దీంతో విక్రమ్‌కు వెంకటేష్ డబ్బులు ఇచ్చే క్రమంలో అప్పటికే మాటువేసిన ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఫోన్ సంభాషణ ఆధారంగా ఏకకాలంలో రెండు జట్లుగా విడిపోయి కల్వకుర్తిలో విక్రమ్‌ను, వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్సై రవిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అనంతరం బుధవారం మహబూబ్‌నగర్‌లోని డీఎస్పీ కార్యాలయానికి ఇద్దరినీ తరలించిన అధికారులు, అక్కడి నుంచి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

లంచావతారాలుగా మారి...

వెల్దండ మండలంలో ఇప్పటికే ముగ్గురు అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. 2006లో ఎస్సైగా పనిచేసిన మురళీకృష్ణ ఓ హోటల్ యజమాని నుంచి రూ.ఆరు వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సదరు బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లోనే లంచం తీసుకునే క్రమంలో ఎస్సైతో పాటు మరో కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అదేవిధంగా 2021 ఏప్రిల్ నెలలో ఓ వ్యక్తికి మైనింగ్ అనుమతి ఇచ్చేందుకు అప్పటి తహసీల్దార్ సైదులుగౌడ్ లక్షల రూపాయలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో నిఘావేసిన అధికారులు తహసీల్దార్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. తాజాగా జరిగిన ఎస్సై రవి సంఘటన కలకలం సృష్టించింది. కాగా వెల్దండకు విధులు నిర్వహించేందుకు వచ్చే కొందరు అధికారులు ఇక్కడి కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులకు తొత్తులుగా మారి పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏకపక్షంగా వ్యవహరించడంతో పాటు అక్రమార్జనకు అలవాటుపడి సంబంధంలేని భూవ్యవహారాల్లో తలదూర్చడంతో పాటు, ఇసుక మాఫియాతో చేతులు కలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇసుక రవాణా విషయంలో నెలవారీ లంచాలకు అలవాటుపడి చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. భూసెటిల్‌మెంట్ల పేరిట లక్షల రూపాయలు లంచాలు తీసుకుంటున్నారని, అంతేగాక కొందరు వ్యక్తులను ఏజెంట్లుగా పెట్టుకుని లక్షలు కూడబెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

పాము కాటుతో ముగ్గురి మృతి

- ఉమ్మడి జిల్లాలోని మూడు వేర్వేరు చోట్ల ఘటనలు


కిష్టన్న (ఫైల్)

శ్రీరంగాపురం/భూత్పూర్/వడ్డేపల్లి, జూన్ 26 : పాము కాటుతో ముగ్గురు మృతి చెందిన సంఘటనలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు వేర్వేరు చోట్ల జరిగాయి.

వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రంలో తెలుగు రాజు కుమార్తె బిందుకు నాలుగు రోజుల క్రితం పాము కరవడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహాల మేరకు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మన్నె పద్మమ్మ(48) ఈనెల 21వ తేదీన ఇంటి ముందు రాత్రి సమయంలో నిద్రిస్తుండగా పాము కాటుకు గురైంది. విషయాన్ని గమనించిన పద్మమ్మ తన భర్త వెంకటయ్యకు చెప్పింది. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకటయ్య, ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామంలో బుధవారం పాము కాటుతో కురువ కిష్టన్న(70) మృతి చెందాడు. పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురికావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మల్లేష్ (ఫైల్)

నవాబ్‌పేట, జూన్ 26 : వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల మండలం ఇప్పాయిపల్లి గేట్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కిషన్‌గూడ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు, యువకుడి స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డ్యాగా మల్లేష్(24) మంగళవారం రాత్రి తన పుట్టినరోజు వేడుకలను గ్రామంలో స్నేహితులతో కలిసి జరుపుకున్నాడు. బుధవారం స్నేహితులు ఎంబటి శ్రీకాంత్, యార అనిల్, కుమ్మరి కృష్ణలు పార్టీ ఇవ్వాలని కోరడంతో రెండు బైకులపై కుల్కచెర్ల మండలంలోని ఇప్పాయిపల్లికి వెళ్లి తాటికల్లు తాగారు. తిరుగు ప్రయాణంలో మత్తులో ఉన్న మల్లేశ్‌ను బైక్ నడపవద్దని స్నేహితులు కోరారు. మల్లేశ్ బైక్‌పై వెనక ఉన్న కృష్ణ భయపడి బైక్‌పై కూర్చోలేదు. మరో బైక్‌పై శ్రీకాంత్, అనిల్ ఉన్న బైక్‌పై కృష్ణ కూర్చున్నాడు. మల్లేశ్ ఒక్కడే బైక్‌పై వేగంగా వెళ్లి కొద్దిదూరంలోనే అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌కు భార్య పుష్ప, కూతురు(1) ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వీవోఏకు గాయాలు

మద్దూర్, జూన్ 26 : రోడ్డు ప్రమాదంలో వీవోఏ గాయపడిన సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామ శివారులో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని మహిళా సమాఖ్యలో పనిచేస్తున్న వీవోఏ గోవిందు బుధవారం మద్దూర్ సమాఖ్య నుంచి విద్యార్థుల యూనిఫాంలను తీసుకొని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. నిడ్జింత గ్రామ శివారులోకి రాగానే కుక్క అడ్డం రావడంతో వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ఘటనలో గోవిందు గాయాలపాలయ్యాడు. గోవింద్‌ను వీవోఏల సంఘం మండల నాయకులు గుత్తి పురుషోత్తం, నీలప్పలతో పాటు పలువురు సభ్యులు పరామర్శించారు.

ట్రాక్టర్ బోల్తా పడి బాలుడి మృతి

పెద్దకొత్తపల్లి, జూన్ 26 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో బాలుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొడెండ్ల నాగులు కుమారుడు శివ(17) తన ట్రాక్టర్‌ను వ్యవసాయ పొలం దగ్గర నుంచి నడుపుతూ ఇంటికి వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులకు శివ ఒక్కడే కుమారుడు కావడంతో రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ విషయంపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సతీష్ తెలిపారు.

ఎక్లాస్‌పురంలో యువకుడు..

వడ్డేపల్లి : గుంతలను తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి పంట పొలంలోకి దూసుకెళ్లిన సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తనగల గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిజ మండలం ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన ఈడిగ రఘుగౌడ్ రెండవ కుమారుడు కల్యాణ్‌గౌడ్(18) గ్రామం నుంచి రాజోలి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన మేనమామ రాజుగౌడ్‌కు చెందిన పొలాన్ని దుక్కి దున్నేందుకు ట్రాక్టర్‌లో వెళ్లాడు. మార్గమధ్యలో తనగల గ్రామ సమీపంలో గుంతలను తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కల్యాణ్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కల్యాణ్‌గౌడ్ ఇంటర్ చదువుతున్నట్లు తెలిసింది.

ఇండో-నేపాల్ ఖేలో భారత్ యూత్ పోటీలకు

జిల్లా క్రీడాకారుడి ఎంపిక


మహ్మద్ అద్నాన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 26 : నేపాల్‌లో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఇండో - నేపాల్ భారత్ యూత్ గేమ్స్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఖేలో భారత్ యూత్ గేమ్స్ భారత క్రికెట్ జట్టుకు జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ అద్నాన్ ఎంపికైయ్యాడు. టోర్నీకి అద్నాన్ ఎంపిక కావడంపై సీనియర్ క్రికెటర్ రియాజుద్దీన్, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు


రాఘవేంద్ర (ఫైల్)

రాజోలి, జూన్ 26 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దతాండ్రపాడు గ్రామంలో వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల నర్సింహులు అనే వ్యక్తికి నలుగురు కుమారులు ఉన్నారు. అయన రెండవ కుమారుడైన గొల్ల రాఘవేంద్ర(40)కు కొన్ని నెలలుగా మానసిక పరిస్థితి సరిగా లేక ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పది, ఇరవై రోజుల తర్వాత తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఇటీవల ఇంట్లో నుంచి వెళ్లిపోయి 50 రోజులు అవుతున్నా తిరిగి ఇంటికి రాకపోవడంతో బుధవారం రాజోలి పోలీస్‌స్టేషన్‌లో తండ్రి గొల్ల నర్సింహులు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు

జడ్చర్ల, జూన్ 26 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామానికి చెందిన వనడ మల్లయ్య కనిపించడం లేదని కుమారుడు కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈనెల 24న మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నానని కోడలు చెన్నమ్మకు చెప్పి బయలుదేరాడు. అనంతరం తనకు ఫోన్ చేసి ఆవును మంచిగా చూసుకో, హన్వాడకు వెళ్లి వస్తానని చెప్పాడు. నాటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నించి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

బంగారం ఆశ చూపి రూ.ఏడు లక్షలు స్వాహా

అచ్చంపేట టౌన్, జూన్ 26 : బంగారం తక్కువ ధరకు ఇస్తామని చెప్పి ఆశ చూపి రూ.ఏడు లక్షలు స్వాహా చేసిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రవీందర్ అనే వ్యక్తి బంగారం మీకు తక్కువ ధరకు ఇస్తానని చెప్పి నకిలీ బంగారం ఇచ్చి రూ.ఏడు లక్షలు తీసుకెళ్లాడు. తర్వాత బంగారం నకిలీదని తెలిసి బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం పట్టివేత

- కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, జూన్ 26 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఓ డీసీఎం గూడ్స్ వాహనాన్ని జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి జాతీయ రహదారి వెంట కానిస్టేబుళ్లు రవి, మంజునాథ్‌నాయుడు విధులు నిర్వహిస్తుండగా పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో అనుమానాస్పదంగా ఓ వాహనం ఆగి ఉండటాన్ని గమనించారు. వాహనం డ్రైవర్ సురేష్‌ను విచారించగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు తెలిపాడు. అనుమతి లేకుండా రవాణా చేస్తుండటంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. విచారణ చేయగా వాహన యాజమాని కుమారస్వామి ఆదేశాల మేరకు ఏపీలోని చిత్తూరు పట్టణం నుంచి సిద్దిపేట జిల్లాలోని గౌరారం అనే గ్రామంలో ఉన్న సుశీల్ అగ్రోవెట్ అనే చేపల దాణా తయారుచేసే కంపెనీకి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు తెలిపాడు. దీంతో వాహన యాజమానిపై, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ వివరించారు.

వైన్‌షాప్‌పై కేసు నమోదు

బల్మూరు, జూన్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న ఉమామహేశ్వర వైన్‌షాప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. వైన్‌షాపులో క్వార్టర్‌పై రూ.20, బీరుపై రూ.10, ఫుల్‌బాటిల్‌పై రూ.20 అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈనెల 24న ఆకస్మికంగా తనిఖీలు చేపట్టామన్నారు. రికార్డులు పరిశీలించగా అవకతవకలు ఉండడంతో పాటు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రూ.30 వేల జరిమానా విధించినట్లు ఆయన వివరించారు. ఇకపై అధిక ధరలకు మద్యం విక్రయిస్తే షాప్ సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

లభ్యమైన మృతదేహం కుటుంబీకులకు అప్పగింత

జడ్చర్ల, జూన్ 26 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం ఉదయం లభ్యమైన ఓ వ్యక్తి(58) మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. మొదట గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన పోలీసులు మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వ్యక్తి ఫొటో, ఆనవాళ్లతో కూడిన వివరాలను సామాజిక మాధ్యమంలో గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. మృతుడు జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని బురెడ్డిపల్లికి చెందిన బురాన్‌గా వారు తెలిపారు. కాగా మూర్ఛవ్యాధితో బురాన్ బాధపడుతున్నాడని, మూర్ఛ వచ్చి పడిపోయి మృతిచెంది ఉంటాడని, మృతిపై అనుమానాలు లేవని తెలిపి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఘటనపై ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

- సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబంధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

- 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటొరెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే.. అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

- మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం
- బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

- తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

- మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం
- పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి
- ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

- త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

- ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు
- కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి
- పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

- యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి
- మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

- కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా
- ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం
- కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు
- నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమీ్మద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయ్యుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

- 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

- ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?
- ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునంధన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ

చారకొండ, జూన్ 26: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. స్వామి వారి కల్యాణానికి సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్, అమ్రాబాద్ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ చిక్కుడు అనురాధ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌లు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అర్చనలు, 11.45 గంటలకు వేదమంత్రాలు, బ్యాండు మేళాలు, సన్నాయిల నడుమ స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని కనులాల తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్వామి వారిని పల్లకి సేవలో ఊరేగించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గజ్జె యాదయ్యగౌడ్, సవారి జంగయ్యగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 26: వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య, గ్రామీణాభివృద్ధి, మునిసిపల్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు పెరిగి డెంగీ, మల్లేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వంటి అంటు వ్యాధులు ప్రబల కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ సిబ్బందికి పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు వార్డుల్లో పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని తగిన ఆరోగ్య సలహా ఇవ్వాలని, అవసరం అయిన వారిని పరీక్షలు, చికిత్స కోసం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని సూచించారు. మునిసిపల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి డ్రైనేజీ, పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. డీపీవో కృష్ణ, డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెల్టూరులో గ్రామసభ

- వెల్టూరు స్టేజీ వద్ద కబ్జాకు గురైన భూమిపై విచారణ చేయాలని గ్రామస్థుల వినతి

ఉప్పునుంతల, జూన్ 26 : మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ఎంపీడీవో బాలచంద్ర సృజన్ హాజరయ్యారు. గ్రామ సభ ప్రారంభం కాగానే శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి వెల్టూరు స్టేజీ వద్ద పుణ్యమూర్తి సత్తమ్మ పేరు మీద ఉన్న 26 గుంటల వ్యవసాయ భూమి కబ్జాపై వెంటనే విచారణ చేయాలని గ్రామస్థులు ఎంపీడీవో బాలచంద్ర సృజన్ దృష్టికి తీసుకువచ్చారు. వెల్టూరు స్టేజీ నుంచి గ్రామం వరకు రోడ్డు ఇరువైపులా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు గ్రామసభ దృష్టికి తెచ్చారు. వెటర్నరీ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో కొత్త మినీ అంగన్‌వాడీ భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగారెడ్డి, నాయకులు బాలరాజ్, అమరేందర్‌రెడ్డి, నరేష్‌యాదవ్, వెంకటయ్య రమేష్, ప్రదీప్‌రెడ్డి, జంగయ్య, సైదులు, వెంకటేస్, భాస్కర్, శ్రీను, లింగమయ్య, జంగారావు, నాగరాజు, శ్రీను, వెంకటేష్, సయ్యద్ ఉన్నారు.

'కూలీ రేట్లు పెంచాలి'

తెలకపల్లి, జూన్ 26 : జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కనీస వేతనాల చట్టాన్ని సవరిస్తూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ స్థాయి అధ్యక్ష కార్యదర్శులు ముఖ్య నాయకులకు జిల్లా స్థాయి శిక్షణా తరగతులు బుధవారం తెలకపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సందర్భంగా పాల్గొని ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ కూలీలకు తక్షణమే కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పనిముట్లు, పెండింగ్ బిల్లులు సకాలంలో జారీ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, అధ్యక్షుడు చింత అంజనేయులు, ఉపాధ్యక్షుడు బాలస్వామి, జిల్లా నాయకులు భాస్కర్, నాగరాజు, వెంకటయ్య, రామకృష్ణ, కాశన్న, మేట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు లాలుగౌడ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాస్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన సివిల్ న్యాయాధికారి

కొల్లాపూర్, జూన్ 26: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కొల్లాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి నడిగొట్టు శ్రీనిధి బుధవారం పట్టణంలోని విశ్వశాంతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధుల సంక్షేమం కోసం మండల న్యాయ సేవాధికార సంఘం ఏర్పాటు చేసిన న్యాయ సలహా కేంద్రం వృద్ధుల సహాయ పడుతున్న తీరును పరిశీలించారు. వృద్ధుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న సేవలు, భోజన సదుపాయం, వైద్య పరీక్షలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుడికిళ్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి నరాల బలహీనత వల్ల కాలుకు రక్తం సరఫరా అందక కాలు పని చేయడం లేదని, కాలుకు ఆపరేషన్ చేయించాలని వైద్యులు చెప్పడంతో ఆ విషయంలో తమ వంతు సహకారం అందిస్తామని న్యాయాధికారి తెలిపారు. ఏ విధమైన సమస్యలు ఉన్నా ప్రతీ శనివారం న్యాయ సలహా కేంద్రానికి వస్తున్న పారా లీగల్ వలంటీర్ డి.మధుసూదన్‌కు తెలియజేస్తే అతను తమ దృష్టికి తెస్తారని సూచించారు. కొల్లాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, ఉపాధ్యక్షులు ఎస్.రామలక్ష్మమ్మ, న్యాయవాదులు టి.రాఘవేంద్ర, పారా లీగల్ వలంటీర్ మధుసూదన్, లోక్ అదాలత్ సిబ్బంది బోగ హరికృష్ణ, విశ్వశాంత వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృష్ణమోహన్, శివరాం, మేనేజర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్‌లతో మహిళా సంఘాలకు ఉపాధి

మన్ననూర్, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న స్వశక్తి కార్యక్రమంలో భాగంగా ఇందిరా క్యాంటీన్ ఏర్పాటుతో మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అదనపు డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు అటవీ చెక్‌పోస్టు ఆవరణలో ఇందిరా మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గేట్‌వే ఆఫ్ నల్లమలగా మన్ననూరు దినదినాభివృద్ధి చెందుతోందని, ఈ ప్రాంతం గుండా నిరంతరం శ్రీశైలం, మద్దిమడుగు పుణ్యక్షేత్రాల సందర్శన నిమిత్తం హైదరాబాద్‌తో పాటుగా రాష్ట్ర నలుమూలలు, కర్నాటక , మహారాష్ట్రల నుంచి నిత్యం పర్యాటకులు తరలి వెళ్తుంటారని, అటవీ చెక్‌పోస్టు వద్ద మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయడం వలన భోజనం, టిఫిన్, స్నాక్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పర్యాటకుల నుంచి క్యాంటీన్ నిర్వహించే మహిళలకు మంచి ఆదాయ వనరులు లభిస్తాయన్నారు. ఇందిరా క్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యత, శుచి, శుభ్రత పాటించేలా విధివిధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. డీపీఎం అరుణాదేవి, ఏపీఎం రాంరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సీసీ శ్రీనివాస్, వీవోఏలు వెంకటయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

రూ. 96వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

అచ్చంపేటటౌన్, జూన్26: క్రెడిట్ కార్డులో ఇబ్బందులు తలెత్తాయని చెప్పి 96 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన అచ్చంపేట పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన నేనావత్ బిక్యాతండ్రి లక్ష్మణ్ గత ఏడాది నవంబరు 2వ తేదిన తన క్రెడిట్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలి లేకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పి లింక్ షేర్ చేశారు. అతను ఆ లింక్ నొక్కడంతో అతని అకౌంట్‌లో ఉన్న రూ 96వేలు పోయినట్లు తెలిపారు. బ్యాంకుల చుట్టూ తిరిగి డబ్బులు ఇక రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

- కలెక్టర్ బదావత్ సంతోష్

- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం ర్యాలీ



నాగర్‌కర్నూల్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, పోలీసులు, విద్యార్థులు, మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 26: యువత మాదకద్రవ్యాలకు బానిసై జీవితాన్ని కోల్పోవద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా పోలీసు, సంక్షేమశాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానం నుంచి నిర్వహించిన భారీ ర్యాలీని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అదనపు ఎస్పీ రామేశ్వర్‌లతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని బస్టాండు మీదుగా నాగనూల్ చౌరస్తా నుంచి శ్రీపురం రోడ్డు వరకు నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో సభతో ముగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ పిల్లలు మాదక ద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల వాడకం నుంచి దూరంగా ఉండాలన్నారు. ఇంట్లో కాని, స్నేహితులు కానీ చెడు అలవాట్లకు గురైతే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సఖీ కోఆర్డినేటర్ సునిత, శ్వేత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్సై లెనిన్ అన్నారు. నేషనల్ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం ఉప్పునుంతల పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్సై సుజ్ఞానం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

● దోమలపెంట: మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించి ఇందుకోసం కృషి చేయాలని ఈగలపెంట ఎస్సై వీరమల్లు అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం దోమలపెంటలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● బిజినేపల్లి: డ్రగ్స్‌కు బానిసలైన కొందరు యువకులు మత్తులో భవిష్యతు మరిచి నిర్వీర్యమైపో తున్నారని ఎస్సై నాగేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి గ్రామ పురవీధుల గుండా బుధవారం పాఠశాల విద్యార్థులతో డ్రగ్స్‌ను తరిమికొడుదాం, యువతను కాపాడుకుందామ ని ర్యాలీ నిర్వహించి ప్రజలకు డ్రగ్స్ తీసుకుంటే కలిగే నష్టాలను వివరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది మద్దిలేటి, ఆంజనేయులు ఉన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

అచ్చంపేటటౌన్: మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరం కంకణబద్ధులమై ఉంటామని ఆర్డీవో మాధవి, సీఐ రవీందర్, ఎస్సై రాములు విద్యార్థులతో కలిసి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు అలవాటు పడి ఉజ్వల భవిష్యతును నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే 100కి డయల్ చేయమని కోరారు.



అచ్చంపేటలో విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న డీఎస్పీ

● ఊర్కొండ: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై వీరబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు. నాయకులు ఆరిఫ్, ఆదినారాయణ, గోపి, మహేందర్, దయాకర్, మల్లేష్, చంద్రు పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

● చారకొండ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం నాయకులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఎస్ఐ రాజశేఖర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాదక ద్రవ్యాల నివారణకై ఎస్ఐ రాజశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు. హెడ్‌కానిస్టేబుళ్లు నాగయ్య, తిర్మాల్‌రావు, కానిస్టేబుళ్లు కేతావత్ హరిలాల్‌నాయక్, రేణయ్య, మల్లేష్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు గజ్జె యాదయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీను, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: సమాజంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ పిలుపునిచ్చారు. బుధవారం కొల్లాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పట్టణంలో మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమలరావు, కానిస్టేబుల్ కల్యాణ్, అధ్యాపకులు రాజవర్ధన్‌రెడ్డి, భాస్కర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంలో ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులతో మాదక ద్రవ్యాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఎస్ఐ రామన్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కబీరు, హనుమంతు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: మండల కేంద్రంలో ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకన్న, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● తాడూరు: మండల కేంద్రంలో ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసు సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా బుధవారం అమ్రాబాద్ మండల కేంద్రంలో సీఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అమ్రాబాద్ ఎస్ఐ ఎస్ ఎన్ ఖాద్రి మండల విద్యాధికారి బాలకిషన్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నాసరయ్య, రాములు నాయక్, శ్రీనివాసులు, పలువురు ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● వంగూరు: యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ మహేందర్ అన్నారు. బుధవారం మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా వంగూరులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఏఎస్ఐ అంజయ్య పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● లింగాల: మాదక ద్రవ్యాల వాడకం లేని సమాజానికై కృషి చేయాలని ఎస్సై జగన్‌మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, గ్రామస్థులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలి

● ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: యువకులు మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం ప్రిన్సిపాల్ ఏ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, పోలీస్ సీఐ బి. నాగర్జునలు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్ మత్తు పానీయాల వినియోగంతో విద్యార్థుల జీవితాలను అర్థాంతరంగా నాశనం చేసుకొంటున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులతో ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి డ్రగ్స్ నివారించాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో కలిసి శివాజీ చౌక్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐలు జి. మాధవరెడ్డి, వీరబాబు, ఎక్సైజ్ ఎస్ఐ వివేక్, కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, రవి, నాయకులు భూపతిరెడ్డి, షాన్‌వాస్‌ఖాన్, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, హనుమన్‌నాయక్, రామరాజు, రమాకాంత్‌రెడ్డి, వెంకటేష్, సురేష్, కళాశాల అధ్యాపకులు వేనయ్య, సదానందంగౌడ్, రమాకాంత్, లక్ష్మీకాంత్, మహబూబ్‌అలీ, మల్లేష్, బాలరాజు, భీమేష్, జుబెర్, రాజేష్, మల్లికార్జున్, శ్రీనివాస్, సంతోష్, ఫాతిమా, సిబ్బంది బాలయ్య పలువురు నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆధునికీకరణ చేపడుదాం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి



పట్టెంలో శిథిలమైన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి చూపుతున్న మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి

బిజినేపల్లి, జూన్ 26 : చాలా ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలం కావడంతో నూతన భవనం నిర్మాణం చేపట్టేవరకు ఆధునీకరణ చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలని పాఠశాల హెచ్ఎంకు ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి సూచించారు. మండలంలోని వట్టెం ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు ఈర్ల వెంకటయ్య పదవీ విరమణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. పదవీ విరమణ అనేది ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో తప్పదని అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత సామాజిక సేవలో ఉంటూ శేషజీవితాన్ని భార్యా పిల్లలు, మనుమలు, మనుమరాళ్లతో సంపూర్ణ ఆరోగ్యంతో గడ పాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు మెరుగైన ఆహారం, సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో అభ్యసన చేపడితే ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఆర్థికంగా నష్టపోరని అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట వట్టెం మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, నీలం రామకృష్ణ, భగవంత్ గౌడ్, తిరుపతయ్య, వినీత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మునిసిపాలిటీలో సమస్యలు లేకుండా చూడండి

● నాగర్‌కర్నూల్ టౌన్ : ప్రస్తుతం వర్షాకాలం కారణంగా మునిసిపాలిటీ పరిధిలో డ్రైనేజీ, రోడ్లు, ఫుట్‌పాత్, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మునిసిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే అండర్‌గ్రౌండ్, సీసీ రోడ్లు, ఫుట్‌పాత్ తదితర పట్టణాభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి విజయ్, ఏఈ ప్రశాంత్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 26: గ్రామపంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాములు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులతో పాటు మునిసిపల్ కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించనప్పటికీ ఇచ్చే వేతనం కూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించాలని అడిగితే బడ్జెట్ లేదని అధికారులు కుంటి సాకు చెబుతున్నారని విమర్శించారు. గత డిసెంబరులో ఎన్నికల కోడ్ ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో వేతనాలు చెల్లించలేదని, ఇప్పుడు ఏ కోడ్ లేకున్నా కార్మికుల వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, నాయకులు, అశోక్, రామయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మహేష్, మల్లేష్, కుర్మయ్య, లింగస్వామి, చిట్టెమ్మ, బాలస్వామి, సైదులు, వేమయ్య, బాలరాజు, సుల్తాన్, గణేష్, రాజు, లక్ష్మయ్య, శాంతయ్య తిరుపతయ్య, వెంకటరెడ్డి, మైబూస్, స్వామి, అలివేల, కృష్ణమ్మ, రేణుకమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ బంద్ విజయవంతం



జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 26: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఏబీవీపీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, నిబంధనలకు వ్యతిరేకంగా బుక్స్, యూనిఫాం అమ్ముతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

● వెల్దండ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తరగతుల బహిష్కరణ చేశారు. ఫీజులను నియంత్రించాలని, మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులను సరిపడా నియమించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి వంశీగౌడ్, హరీష్, ఉమేష్, అల్లాజీ ఉన్నారు.

జీరో బిల్లుకోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రదక్షిణలు

బల్మూరు, జూన్ 26: తెలంగాణ రాష్ట్రం మలిదశ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం ద్వారా విద్యుత్ వినియోగదారుడు దరఖాస్తు చేసుకున్న వారికి జీరో బిల్లులను అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులు చేసుకున్న వారిలో చాలా మందికి జీరో బిల్లులు రాకపోవడంతో ఆయా గ్రామాల్లో వినియోగదారుడు స్థానిక మండల పరిషత్ కార్యాలయం చుట్టే తిరుగుతున్నారు. కొందరు వినియోగదారులకు సరైన అవగాహన లేకపోవడంతో ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో అర్థం కాక అటు విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ మరికొందరు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండల వ్యాప్తంగా 5664మంది వినియోగదారులు ఉన్నారని, ఇందులో 3104 మంది విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు వస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ తెలిపారు. మిగతా 2560మంది వినియోగదారులకు జీరో బిల్లులు రావడం లేదని వారు సరైన పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. వచ్చే నెల నుంచి అయినా జీరో బిల్లులు అందేలా చూడాలని అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై పాలు పారబోసి నిరసన



రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

ఉప్పునుంతల,జూన్ 26 : పాడి రైతులకు తక్షణమే పాల బిల్లులు చెల్లించి రైతులను ఆదుకోవాలని బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని పోషమ్మ చౌరస్తాలో రైతులు పాలు రోడ్డుపైన పోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి పాల బిల్లులు రాక నానా తిప్పలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాక పాడి పశువులకు, పాడి గేదెలకు పశుగ్రాసం, దాణా పెట్టలేకపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని పాడి రైతులకు పాల బిల్లులు ఇచ్చే విధంగా చూడాలని రైతులు కోరారు. గోపాల్‌రెడ్డి, బాల్‌నారి, రైతులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

దోమలపెంట, జూన్ 26: నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని అమ్రాబాద్ మండల విద్యాధికారి బాలకిషన్ అన్నారు. బుధవారం సార్లపల్లి, కుడిచింతలబాయి, వటవర్లపల్లి గ్రామాల్లో ఉన్న పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. హెచ్ఎంలు జ్యోతి, రామకృష్ణ, తేజశ్రీ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అమ్రాబాద్, జూన్ 26: పదర మండల పరిధిలోని వంకేశ్వరం గ్రామంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పదర జడ్పీటీసీ సభ్యులు రాంబాబు నాయక్ బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. తన జడ్పీటీసీ నిధులు నుంచి రూ. 8 లక్షలతో ఈ రెండు పనులకు కేటాయించినట్లు విలేకరులకు తెలిపారు. మాజీ సర్పంచ్ దశరథం నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

కల్వకుర్తి, జూన్ 26: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాతో సత్కరించి నగదు బహుమతి ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు డీఎస్పీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, సీఐ నాగర్జున హాజరయ్యారు. అనంతరం చక్కటి ఫలితాలను సాధించేందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డిని అధ్యాపకులను అభినందించి హెచ్ఈసీ రాష్ట్రంలో 4వ ర్యాంకు సాధించిన ఆదిలక్ష్మికి రూ. 5వేలు ప్రైజ్ మనీని ఎమ్మెల్యే అందజేశారు. కళాశాల అధ్యాపకులు వేనయ్య, రమాకాంత్, లక్ష్మీకాంత్, సాగర్, మహబూబ్‌అలీ, మల్లేష్, భీమేష్, జుబేర్, రాజేష్, మల్లికార్జున్, బిల్‌కీస్, ఫాతిమా, బాలరాజ్, శ్రీనివాస్, సంతోష్, బాలయ్య పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి'

దోమలపెంట, జూన్ 26: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు రెండో విడత మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేసేందుకు వెనుకాడేది లేదని వటవర్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్నాటి శ్రీనివా సులు డిమాండ్ చేశారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.